సంపుటి :02 సంచిక :199 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com
Voice of the people




ప్రియమైన 'అక్షర దర్బార్' దినపత్రిక పాఠకులు, ప్రకటన కర్తలు, శ్రేయోభిలాషులందరికీ, విజయదశమి శుభాకాంక్షలు! చెడుపై మంచి సాధించిన ఈ విజయానికి ప్రతీకగా, మీ జీవితంలో ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయి, మీరు చేపట్టే ప్రతి కార్యంలో విజయం సిద్ధించాలని కోరుకుంటున్నాము. మీ కుటుంబంలో సంతోషం, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థిస్తూ, శుభాలు కలగాలని ఆశిస్తున్నాం.

– ఎడిటర్ వేముల రాజేశ్వర్ రావు

గమనిక : రేపు మా దినపత్రిక సంచిక వెలువడదు. పాఠకులు గమనించగలరు..

బుధవారం 01, అక్టోబర్ 2025





# నువ్వా.. నేనా!

## స్థానిక సంగ్రామానికి మూడు ప్రధాన పార్టీలు సిద్ధం

- ఎక్కువ స్థానాలను కైవసం చేసుకున్నేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహం
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి లబ్ధిపొందేందుకు గులాబీ సేన ప్లాన్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల్లో లోపాలను ప్రజలకు వివరించేందుకు కమల దళం ప్రణాళిక

స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కాయి. పల్లెల్లో పట్టు సాధించుకునేందుకు రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. మెజార్టీ సీట్లు సాధించుకోవడమే లక్ష్యంగా ఎత్తుగడలతో ముందుకు సాగనున్నాయి. మొదటగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరగనుండటంతో నెలన్నర పాటు గ్రామాల్లో ఎన్నికల వాతావరణం కనిపించనుంది. ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్ ఎన్ని కలు కూడా నిర్వహించే అవకాశం ఉంది. దీంతో రాజకీయ పార్టీలన్నీ విమర్శలు, ప్రతి విమర్శలకు కత్తులు నూరుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి కొంత మేర కలసివస్తాయి. చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు భవిష్యత్తులో చేయాల్సిన పనులు చెప్పుకోవడానికి అధికార పక్షానికి అవకాశం ఉంటుంది. ఇక ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలు, అమలుకాని ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తుంటాయి. – అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02



# ప్రధాన పార్టీల్లో పోటాపోటీ

## అభ్యర్థిత్వం రేసులో పలువురు నేతలు

### ఆసక్తి రేపుతున్న పరకాల జడ్పీటీసీ స్థానం

పరకాల జడ్పీటీసీ స్థానం నుంచి పోటీ చేయాలని ప్రధాన రాజకీయ పార్టీల్లో పలువురు నేతలు ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు అభ్యర్థిత్వం కోసం ఎవరికి వారే తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు సమాచారం. దీంతో అభ్యర్థి ఎంపిక ఆయా ప్రధాన రాజకీయ పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారినట్లు తెలుస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పరకాల జడ్పీటీసీ స్థానానికి రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. అంటే ఈనెల 13న నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. దీంతో పరకాల జడ్పీటీసీ స్థానం నుంచి బరిలోకి దిగేందుకు ప్రధాన రాజకీయ పార్టీల్లో నేతల మధ్య పోటీ ఎక్కువగా ఉన్నట్లు కనబడుతుంది. పరకాల జడ్పీటీసీ స్థానం జనరల్ కేటగిరీలోకి రావటమే ఇందుకు కారణమని చెప్పవచ్చు. జనరల్ కావడం వల్ల ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ ఏర్పడినట్లు స్పష్టం అవుతుంది. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థిత్వం కోసం పోటీ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

– అక్షరదర్బార్, పరకాల

04

# మావోయిస్టుల కుట్ర భగ్నం



- ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాల ఆపరేషన్
- ఆర్‌డీఎక్స్‌తో సహా పేలుడు పదార్థాల స్వాధీనం

03

## అధిక లాభం ఆశ చూపి

# రూ.కోట్లల్లో దోపిడీ

- టాస్క్‌ఫోర్స్, పాలకుర్తి పోలీసుల ఆపరేషన్.. ముఠా అరెస్ట్
- హెబ్బిబా పేరుతో నకిలీ చిట్టీ వ్యాపారం
- రూ.16.23 కోట్ల వరకు వసూలు చేసిన నిందితులు
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్

03



# బీఆర్ఎస్ సీనియర్ నాయకుడికి మాతృవియోగం

## నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ నన్నే సాహెబ్ తల్లి బుధవారం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నన్నే సాహెబ్ ఇంటికి చేరుకుని ఆయన తల్లి పార్థివ దేహంపై పూల మాల వేసి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కన్నుల పండువగా మహాచండీయాగం

## పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మంజూరు నగర్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొన సాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఆలయంలో మహా చండీయాగం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్త గండ్ర వెంకట రమణా



రెడ్డి-జ్యోతి వేడుకలకు కుటుంబ సమేతంగా హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# నువ్వా..నేనా!

- స్థానిక సంగ్రామానికి మూడు ప్రధాన పార్టీలు సిద్ధం
- ఎక్కువ స్థానాలను కైవసం చేసుకున్నేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహం
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి లబ్ధిపొందేందుకు గులాబీ సేన ప్లాన్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలే కమల దళం బలం

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కాయి. పల్లెల్లో పట్టు సాధించుకునేందుకు రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. మెజార్టీ సీట్లు సాధించుకోవడమే లక్ష్యంగా ఎత్తుగడలతో ముందుకు సాగనున్నాయి. మొదటగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరగనుండటంతో నెలన్నర పాటు గ్రామాల్లో ఎన్నికల వాతావరణం కనిపించనుంది. ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉంది. దీంతో రాజకీయ పార్టీలన్నీ విమర్శలు, ప్రతి విమర్శలకు కత్తులు నూరుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి కొంత మేర కలిసివస్తాయి. చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు భవిష్యత్తులో చేయాల్సిన పనులు చెప్పుకోవడానికి అధికార పక్షానికి అవకాశం ఉంటుంది. ఇక ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలు, అమలుకాని ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తుంటాయి.

### - హస్తం పార్టీకి ప్రచార అస్త్రాలు ఇవి..

ఇక అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎన్ని కల్లో విజయం సాధించేందుకు పటిష్టమైన ప్రణాళికలు రచిస్తున్నది. ఒక వైపు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతానికి చర్యలు తీసుకుంటూనే మరో వైపు బీఆర్ఎస్, బీజేపీపైన విమర్శల జోరు పెంచుతోంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం, ఫార్ములా ఈ కారు రేసులో అవినీతి జరిగిందని, విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష కోట్లకు పైగా అవినీతి జరిగిందని విమర్శలతో పాటు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చాక అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారాస్త్రాలుగా మల్చుకోవాలని భావిస్తున్నది. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వరికి రూ.500 బోనస్, ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకురావడం వంటి అంశాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభావం చూపుతాయని అధికార కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తున్నది. దీంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత గృహవిద్యుత్, రూ.500 లకే గ్యాస్, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. అంతేకాకుండా గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన, ఫోర్త్ సిటీకి ఫౌండేషన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అభివృద్ధి, మూసీ నదీ ప్రక్షాళన, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. అయితే యూరియా సమస్యపై క్షేత్ర స్థాయిలో కొంతమేర వ్యతిరేకత వచ్చినప్పటికీ.. కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు నిర్వహించి యూరియా సమస్యను చాలా వరకు పరిష్కరించినట్లు భావిస్తున్నారు.

### - 'కాంగ్రెస్ బాకీ కార్డు'తో ప్రజల్లోకి బీఆర్ఎస్

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా పార్టీ శ్రేణులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ పార్టీ కేడర్ కు దిశానిర్దేశం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు గెలుచుకోకపోవడంతో కొంత కాలం స్తబ్ధతగా ఉన్నప్పటికీ.. ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శల జోరు పెంచింది. ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాతో పేదల బతుకులు ఆగమైనాయని, యూరియా కొరతను తీర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని క్షేత్ర స్థాయిలో ఆందోళలను చేపడుతూ పార్టీలో మరింత కదలిక తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్లోని తన వ్యవసాయ క్షేత్రం నుంచే పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇక కేటీఆర్, హరీశ్ రావుతో పాటు పార్టీ ముఖ్య నేతలు నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తు న్నారు. తద్వారా పార్టీ శ్రేణులను పనిలో పెడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని 'బాకీ కార్డు' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని బీఆర్ఎస్ చేపట్టింది. యూరియా కొరతతో రైతులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అది తమకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వస్తుందనే అభిప్రాయంతో గులాబీ నేతలున్నారు.

### - సత్తా చాటాలనే లక్ష్యంతో కమల దళం..

లోక్సభ ఎన్నికల్లో ఈసారి సత్తా చాటాలని కమల దళం ఉవ్విళ్లూరుతోంది. ఎన్నికల హామీలు నేరవేర్చడం, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీనే అంటూ ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. గ్రామాల్లో యువత మెజార్టీగా బీజేపీనే ఆదరిస్తున్నారని, పంచాయతీల్లో మెరుగైన స్థానాలు వస్తాయనే అంచనాతో ఉన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాలకు చేసిందేమి లేదని, ఇందిరమ్మ ఇంటి నిర్మా ణాలకు కేంద్ర వాటా ఉందన్న విషయాన్ని ప్రజలకు వివరించనున్నారు. వీటితో పాటు జాతీయ రహదారులు, కేంద్రం నిధులతోనే జాతీయ ఉపాధి హామీ పనుల వంటివి అమలవుతున్నాయనే విషయాన్ని ప్రజలకు వివరించాలనే ఆలోచనతో ఉన్నారు. అసెంబ్లీలో 8 మంది ఎమ్మెల్యేలతో పాటు 8 మంది ఎంపీలు కూడా ఉన్నందున ఆయా నియోజకవర్గాల్లో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తాయని పార్టీ నాయకులు ఆశిస్తున్నారు.




# ట్రై సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

- ఉర్సు రంగలీలా మైదానంలో దసరా ఉత్సవాలు
- గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం ఉదయం వరకు ట్రాఫిక్ ఆంక్షలు
- వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ట్రై సిటీ పరిధిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గురువారం మధ్యాహ్నం 3 నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రకటించారు. ఆయన వెల్లడించిన ప్రకారం...

- ఖమ్మం నుంచి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు పున్నెలు క్రాస్ నుంచి ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లాలి
- కరీంనగర్ నుంచి ఖమ్మం వెళ్ళవలసిన వాహనాలు కొత్తపేట, ఎనుమాముల, లేబర్ కాలనీ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా వెళ్లాలి
- హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లె వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నెలు క్రాస్ నుండి వెళ్లాలి
- ఉర్సు గుట్టకు వచ్చే వాహనాల కోసం క్రింది ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.
- హన్మకొండ హంటర్ రోడ్ నుండి ఉర్సు గుట్టకు వచ్చే వాహనాలు కొలంబో హాస్పిటల్, బీఆర్ నగర్ ఎదురుగా గానుగ ఆయిల్ పాయింట్ దగ్గర, ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్, జేఎస్ఎం స్కూల్ లో పార్కింగ్ చేయాలి
- కడిపికొండ నుండి వచ్చే వాహనాలు భారత్ పెట్రోల్ పంపు దగ్గర పార్కింగ్ చేయాలి
- ఆర్టీవో జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు, లక్ష్మీ ఫంక్షన్ హాల్ ఓపెన్ ప్లేస్, తాళ్ల పద్మావతి కాలేజ్ దగ్గర పార్కింగ్ చేయాలి
- కరీమాబాద్ నుంచి వచ్చే వాహనాలు భీరన్న గుడి దగ్గర పార్కింగ్ చేయాలి

# గుప్పుమంటున్న గుడుంబా

## పండుగ పేరుతో పల్లెల్లో జోరుగా సరఫరా



అక్షర దర్బార్: టేకుమట్ల మండలంలో దసరా పండుగ ఆనందోత్సవాల మధ్య సారా అక్రమ విక్రయాలు, అధిక వినియోగం ఆందోళనకరంగా మారింది. గ్రామాల నుంచి పట్టణాల వరకు మద్యం దుకాణాల దగ్గర కిక్కిరిస్తూ కనిపిస్తోంది. అంతేకాకుండా అనధికారికంగా నిల్వలు చేసుకుని, అధిక ధరలకు విక్రయించే వారు మరింత చురుకుగా మారారు.ప్రజలు  పండుగను కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన వేళ మద్యం మత్తులో వివాదాలు, గొడవలు పెరిగే ప్రభావం ఉంది. మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాప్లతో కొన్ని చోట్ల మద్యం ప్రభావంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పండుగ పేరుతో సారా వ్యసనం పెరగడం సమాజానికి ముప్పుగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.  ఎక్సైజ్ అధికారులు కొద్దిపాటి చర్యలకే పరిమితమవ్వడం విమర్శలకు దారితీస్తోంది.

# డోర్నకల్ జంక్షన్ వద్ద నూతన ఆర్వోఆర్

**- రూ.320 కోట్లతో  ప్రాజెక్టుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్**

**- పనులు పూర్తయితే సులభతరంగా రైళ్ల రాకపోకలు**

అక్షరదర్బార్, డోర్నకల్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ వద్ద 10.5 కిలో మీటర్ల మేర రైల్ ఓవర్ రైల్ (ఆర్వోఆర్) ప్రాజెక్టు నిర్మాణానికి రైల్వేశాఖ తాజాగా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.320 కోట్లు. కాజీపేట– విజయవాడ గ్రాండ్–ట్రంక్ మార్గంలో, రద్దీగా ఉండే డోర్నకల్ జంక్షన్ వద్ద ఈ ఆర్వోఆర్ నిర్మాణం వల్ల రైళ్ల రాకపోకలు మరింత సులభతరమవుతాయి. ప్రస్తుతం విజయవాడ నుంచి భద్రాచలంరోడ్ వైపు వెళ్లే రైళ్లు స్టేషన్ మీదుగా క్రాసింగ్ కోసం ఆపాల్సి వస్తోంది. అయితే, ఈ 10.5 కిమీ. ఆర్వోఆర్ నిర్మాణం పూర్తయితే, విజయవాడ– భద్రాచలం రోడ్ మధ్య రాకపోకలకు క్రాసింగ్ సమస్య తొలగిపోయి, రైళ్ల నిలుపుదల తప్పిపోతుంది. తద్వారా, భద్రాచలంరోడ్  పరిసర ప్రాంతాల నుంచి బొగ్గు రవాణా సులభతరం అవుతుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. కాజీపేట– విజయవాడ మార్గంలో ప్రస్తుతం మూడో లైన్ పనులు చివరిదశలో ఉండగా, నాలుగో లైన్ ప్రతిపాదన పురోగతిలో ఉన్న నేపథ్యంలో, ఈ ఆర్వోఆర్ ప్రాజెక్టు ఈ రద్దీ మార్గంలో రైళ్ల వేగం, సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనుంది.





## అధిక లాభం ఆశ చూపి

# రూ.కోట్లల్లో దోపిడీ

- టాస్క్‌ఫోర్స్, పాలకుర్తి పోలీసుల ఆపరేషన్.. ముఠా అరెస్ట్
- హెబ్సిబా పేరుతో నకిలీ చిట్టీ వ్యాపారం
- రూ.16.23 కోట్ల వరకు వసూలు చేసిన నిందితులు
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్

**అక్షరదర్బార్, హనుమకొండ :**

వరంగల్ జిల్లా పాలకుర్తి కేంద్రంగా 'హెబ్సిబా' అనే సంస్థను స్థాపించి, అధిక లాభాల ఆశ చూపి అమాయక ప్రజల నుంచి రూ.కోట్లు వసూలు చేసిన ముఠాను టాస్క్ ఫోర్స్, పాలకుర్తి పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టి అరెస్టు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన తెప్పాలి సైదులు (55) తన భార్య పేరుపై 2023లో హెబ్సిబా సంస్థను స్థాపించాడు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే 2024లో చిట్టీ వ్యాపారం మొదలుపెట్టి, ఒక్కో సభ్యుడి నుంచి రూ. 6,000 వసూలు చేశాడు. దీనిలో రూ. 4,000 తన వద్ద డిపాజిట్ చేసుకొని, మిగిలిన రూ. 2,000కి కేవలం రూ.300 విలువ చేసే వస్తువులను ఇచ్చి నమ్మకం కలిగించాడు. సంస్థలో చేరిన ప్రతి సభ్యుడికి నెలకు రూ.1,000 చొప్పున 20 నెలల పాటు తిరిగి చెల్లిస్తామని ఆశ చూపాడు. మనుబోతుల రామకృష్ణ (36), పొడిల సురేష్ కుమార్ (35), పొడిల శ్రీధర్ (30) ను ఏజెంట్లుగా నియమించి, సుమారు 28,493 సభ్యత్వాలు నమోదు చేసుకున్నాడు. కేవలం డిపాజిట్ల రూపంలోనే ప్రజల నుంచి రూ.11.39 కోట్లు వసూలు చేశాడు. వస్తువుల రూపంలో రూ.2 వేలు తీసుకుని, రూ.300 విలువైన వస్తువుల ఇచ్చిమరో రూ.4.84 కోట్లు వసూలు చేశాడు.

**- బాధితుల నుంచి ఫిర్యాదులు..**

ముఠా చేతిలో వరుసగా ఫిర్యాదులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రజల సొమ్ముతో పారిపోయే ప్రమాదం ఉందని భావించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తమదైన శైలిలో విచారించగా మోసం బయటపడింది. నిందితుల నుంచి రూ. 5 లక్షల 92 వేల నగదు, 684.5 గ్రాముల బంగారు నాణాలు, 150 గ్రాముల ఆభరణాలు, కారు, ల్యాప్‌టాప్, క్యాష్ కౌంటింగ్ మెషిన్, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, నిందితులు జమ చేసిన వివిధ 17 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.5.48 కోట్ల మొత్తాన్ని లావాదేవీలు జరగకుండా ఫ్రీజ్ చేశారు. ప్రధాన నిందితుడు సైదులుపై గతంలోనూ మెదక్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో పదికి పైగా చీటింగ్ కేసులు ఉన్నట్లు సీపీ తెలిపారు.



# మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు

## ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ, మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 10 వ రోజు మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.  వేద పండితులు మణిదీప్ శర్మ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు,హోమం నిర్వహించడం జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల ప్రముఖ వైద్యులు డా. సిరంగి సంతోష్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, కాచం గురు ప్రసాద్, నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివ ప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల కుట్ర భగ్నం

- ఛత్తీస్ గఢ్ లో భద్రతా దళాల ఆపరేషన్
- ఆర్డీఎక్స్ తో సహా పేలుడు పదార్థాల స్వాధీనం




అక్షరదర్బార్, బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు మావోయిస్టులకు గట్టి ఎదురు దెబ్బ తగిలేలా భారీ విజయాన్ని సాధించాయి. పామెడ్ ప్రాంతంలోని కౌరగుట్ట అడవుల్లో కోబ్రా 208 బెటాలియన్ బుధవారం నిర్వహించిన కూంబింగ్‌లో, మావోయిస్టులు కంచల్ గ్రామం సమీపంలోని అడవుల్లో భూగర్భంలో ఒక గొయ్యి తవ్వి దాచిపెట్టిన భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో గన్ పౌడర్, ఆర్‌డీఎక్స్, కార్డెక్స్ వైర్, బీజీఎల్ సెల్స్, బీజీఎల్ రౌండ్లు, ఎలక్ట్రిక్, నాన్–ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, ఇంప్రూవైజ్డ్ బాంబులు, ఇంప్రూవైజ్డ్ గ్రెనేడ్‌లు, క్రిస్టల్ షుగర్, రైఫిల్ బయోనెట్‌లు, ఇనుప పటకార్లు, బారెల్స్‌లో ఉపయోగించే ఇనుప రాడ్‌లు ఉన్నాయి. ఈ కీలకమైన పేలుడు సామగ్రిని సీజ్ చేయడం ద్వారా మావోయిస్టులు తలపెట్టిన కుట్రను భద్రతా దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి.

## మోసపూరిత ప్రకటనలు నమ్మి

# ప్రజలు మోసపోవద్దు



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లి గ్రామంలో బుధవారం  మొగుళ్ళపల్లి ఎస్ ఐ బి అశోక్  ఆదేశాలతో  మొగుళ్ళపల్లి పోలీసులు సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.  ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ..  డిజిటల్ అరెస్ట్. సైబర్ క్రైమ్. ఫేక్ పోలీస్. గూర్చి గ్రామస్తులకు వివరించారు .ఎవరికైనా ఇలా సైబర్ నేరస్తులు కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నాము అంటే వెంటనే 1930 నెంబర్ కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పరిచయం లేని వ్యక్తులు కాల్ చేసి ఆన్లైన్ లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయి అనే మోసపూరిత ప్రకటనలు నమ్మి మోసపోవద్దు అని తెలిపారు అంతేకాకుండా  బ్యాంకు డెబిట్ కార్డు .క్రెడిట్ కార్డు వివరాలు  బ్యాంకు సంబంధించిన ఓటీపీలు  రైతుబంధు రైతు బీమా రైతు భరోసా వంటి పథకాలకు సంబంధించిన సోషల్ మీడియాలో వచ్చే ఏపీకే  యాప్స్ ఇన్స్టాల్ చేయవద్దని ఇందిరమ్మ ఇల్లు వచ్చిందంటూ వచ్చే అపరిచిత కాల్స్ ను నమ్మి మోసపోవద్దని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు,



# సీనియర్ జర్నలిస్ట్ కు బిర్రు వెంకన్న నివాళి..

అక్షర దర్బార్, కేసముద్రం : ఆకస్మికంగా మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు గొర్రె చిట్టిబాబు మృత దేహానికి బిఆర్ఎస్ నాయకులు, కేసముద్రం స్టేషన్ గ్రామ పంచాయతీ తాజా వార్డు మెంబర్ బిర్రు వెంకన్న పూలమాలవేసి బుధవారం నివాళుల ర్పించారు. శోకసముద్రంలో ఉన్న చిట్టీ బాబు కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. చిట్టీ బాబు మృతి తీరని లోటన్నారు. దళిత బంధువులు వర్గానికి, ఆప్తులకు అయన అందించిన సేవలు ఎనలేనివని అన్నారు.




# హామీలను విస్మరించిన పార్టీలకు బుద్ధి చెప్పాలి

## ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

అక్షరదర్బార్, నర్సంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో హామీలు విస్మరించిన పాలక పార్టీల అభ్యర్థులను ఓడించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపుని చ్చారు. నర్సంపేటలో జరిగిన పార్టీ డివిజన్ సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు జరపకపో వడం, నిధులు విడుదల చేయకపోవడం వల్ల స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వామపక్ష, సామాజిక అభ్యుదయ శక్తులతో కలిసి పోటీ చేయడానికి సిద్ధమని తెలిపారు. ప్రజలు డబ్బు, మద్యం ప్రభావాలకు లొంగకుండా అవగాహన కలిగిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లను ఎన్నికల ఆయుధంగా వాడుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న నాగెల్లి కొమురయ్య ఎల్లబోయిన రాజు గాజుల వెంకటయ్య మహమ్మద్ అల్లి సాబ్ బుడిమే సురేందర్ బత్తిని కుమారస్వామి కర్నే సాంబయ్య జన్ను రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ వైపు యువత చూపు

అక్షర దర్బార్, నర్సంపేట: భారతీయ జనతా పార్టీ వైపే యువత దృష్టి సారిస్తున్నారని వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డా.గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం దుగ్గొండి మండలం రాజ్యా తండా, గోబ్రా తండాలకు చెందిన అజ్మీరా శ్రీనుబాబు, అజ్మీరా దిలీప్, అజ్మీరా రాజ్‌కుమార్, అజ్మీరా రాజేందర్, బానోత్ రమేష్, బానోత్ వీరభద్రులు కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి డా. రాణా ప్రతాప్ రెడ్డి కమలం కండువాలు స్వాగతం కలిపారు. బీఆర్ఎస్–కాంగ్రెస్ మోసపూ రిత హామీలపై విసిగి, మోదీ ప్రభుత్వ పథకాలతో ఆకర్షితులై ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారని పేర్కొన్నారు.

# గాంధీకి తగిన గౌరవం కల్పించాలి

## పరకాల పట్టణంలో విగ్రహం ఏర్పాటు చేయాలి

అక్షరదర్బార్, పరకాల : పరకాల పట్టణంలో మహాత్మా గాంధీకి తగిన గౌరవం అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అంబేద్కర్ సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహం దెబ్బతి నడంతో తొలగించారని, అప్పటి నుంచి పట్టణంలో గాంధీ విగ్రహం లేకపోవడం విచారకరమని తెలిపారు. ప్రస్తుతం అమరవీరుల మైదానంలో ఉన్న గాంధీ విగ్రహం వద్దే జయంతి, వర్ధంతి కార్య క్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, అది పట్టణ ప్రజల ఆశయాలను ప్రతిబింబించడం లేదని పలువురు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గాంధీ విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాన కూడలిలో పునః స్థాపించాలని స్థానిక ఎమ్మెల్యేను పట్టణ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. "దేశానికి స్వాతంత్ర్యం అందించిన మహనీయుడికి పరకాలలో ఒక గుర్తుగా విగ్రహం తప్పనిస రిగా ఉండాలి," అని వారు స్పష్టం చేశారు.

# నేటికీ అందని కొత్త జీఎస్టీ ఫలాలు

అక్షరదర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలోని గ్రామాల్లో ప్రజలకు తగ్గించిన జీఎస్టీ రేట్ల ప్రయోజనాలు అందడంలేదు. గత నెల 22వ తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం తీసుకొని అమ లు చేస్తున్నప్పటికీ, స్థానిక వ్యాపారులు ఇంకా పాత ధరలకే వస్తువు లు, మందులు విక్రయిస్తున్నారు. "కొత్త రేట్లు రాలేదని" నెపంతో పాత రేట్లకే సరుకులు ఇస్తున్నారని, పైగా మెడికల్ షాపులు బిల్లులు కూడా ఇవ్వకుండా మందులు అమ్ముతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖలు జోక్యం చేసుకొని తగ్గిన జీఎస్టీ రేట్లు అమలు అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్రధాన పార్టీల్లో పోటాపోటీ

- అభ్యర్థిత్వం రేసులో పలువురు నేతలు
- ఆసక్తి రేపుతున్న పరకాల జడ్పీటీసీ స్థానం




అక్షరదర్బార్, పరకాల: పరకాల జడ్పీటీసీ స్థానం నుంచి పోటీ చేయాలని ప్రధాన రాజకీయ పార్టీల్లో పలువురు నేతలు ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు అభ్యర్థిత్వం కోసం ఎవరికి వారే తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు సమాచారం. దీంతో అభ్యర్థి ఎంపిక ఆయా ప్రధాన రాజకీయ పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారినట్లు తెలుస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పరకాల జడ్పీటీసీ స్థానానికి రెండో విడత ఎన్నికలు జర గనున్నాయి. అంటే ఈనెల 13న నోటిఫికేషన్ వెలువడ నుంది. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. దీంతో పరకాల జడ్పీటీసీ స్థానం నుంచి బరిలోకి దిగేందుకు ప్రధాన రాజకీయ పార్టీల్లో నేతల మధ్య పోటీ ఎక్కువగా ఉన్నట్లు కనబడుతుంది.

పరకాల జడ్పీటీసీ స్థానం జనరల్ కేటగిరీలోకి రావటమే ఇందుకు కారణమని చెప్పవచ్చు. జనరల్ కావడం వల్ల ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ ఏర్పడినట్లు స్పష్టం అవుతుంది. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో అభ్యర్థిత్వం కోసం పోటీ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

### - రేసులో ఉండేదెవరంటే

బీఆర్ఎస్ నుంచి జడ్పీటీసీ అభ్యర్థిత్వం కోసం ప్రధానంగా నలుగురి పేర్లు వినబడుతున్నాయి. గురిజ పల్లి ప్రకాష్ రావు, చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, గంట సమ్మిరెడ్డి, మునిగాల సురేందర్ రావు ఆ నలుగురిలో ఉన్నారు. ఈ నలుగురు బీఆర్ఎస్ నుంచి జడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిసింది. అయితే పార్టీ నాయకత్వం ఏం నిర్ణయం తీసుకుంటుంది, వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఎవరికి దక్కనుందనేది చర్చనీయాంశమైంది. ఇక కాంగ్రెస్ నుంచి పార్టీ నేత కట్కూరి దేవేందర్ రెడ్డి పేరు ప్రధా నంగా వినపడుతుంది. అయితే హనుమకొండ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. జడ్పీ చైర్ పర్సన్ పదవి కోసం బరిలోకి దిగి తే కాంగ్రెస్ పార్టీ నేత దొమ్మటి సాంబయ్య కూతురు మౌనిక జనరల్ స్థానమైన పరకాల జడ్పీటీసీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగు తుంది. నోటిఫికేషన్ వెలువడటానికి మరి కొంత సమ యం ఉన్నందున పరకాల జడ్పీటీసీ స్థానం నుంచి కాం గ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న నేతల పేర్లు ఇంకా బయ టకు వచ్చే అవకాశం లేకపోలేదు. మొత్తానికి బీఆర్ఎ స్, కాంగ్రెస్ పార్టీల నుంచి అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న నేత లు ఎవరికి వారే టికెట్ రేసులో ఉన్నారు. పార్టీ తనకు అవకాశం కల్పిస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# శ్మశానవాటికకు దారేది?

- మోకాలు లోతు నీటిలో నుంచి వెళ్లి అంత్యక్రియలు
- పక్కా రహదారి నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు

అక్షర దర్బార్, వెంకటాపురం : స్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన రహదారి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో మార్గం మోకాళ్ల లోతు నీటితో, బురదతో నిండిపోవడంతో మృతదేహాన్ని తీసు కెళ్లడమే పెద్ద సవాలుగా మారింది. వృద్ధులు, మహిళలు, పిల్లలు ప్రయాణించలేని స్థితి నెలకొని మానవత్వాన్నే కలచివేస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు పంచాయతీ, మండల అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించినా స్పందన రాకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్మశాన వాటికకు తక్షణమే పక్కా రహదారి నిర్మించాలని, తాత్కాలికంగా అయినా బాటమార్గాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. "చివరి గమ్యం సైతం హృదయ విదారకంగా మారడం మానవత్వా నికి తగదు" అని వాపోయిన గ్రామస్తులు, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరు తున్నారు.





# చింతలపల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఆలయాల అభివృద్ధి కమిటీని గ్రామ ప్రజల సమక్షంలో బుధవారం ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఆట స్థల ప్రాంగణంలో గ్రామ ప్రముఖులు, కుల సంఘాలు, యువజన సంఘాలు పాల్గొని ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శృంగారపు రంగాచారి, ప్రధాన కార్యదర్శిగా అల్లం తిరుపతి, కోశాధికారిగా సామల రమేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్య క్షులుగా పిట్టల రమేష్, గుర్రపు రాజు, ఒర్సు భద్రయ్య, ప్రచార కార్యదర్శిగా మూసాపూరి రవీందర్ ఎంపికయ్యారు. కార్యదర్శు లుగా చేర్ల చందు, తూముల సంజీవ్, గుండా సురేష్, చిలగాని నాగరాజ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులుగా ఒర్సు శ్రీకాంత్, ర్యాకం రవీందర్, బుర్ర నరేష్, సాదుల రవీందర్, పిట్టల రామచందర్, మూసాపూరి రమేష్, కోడెల రవి, పెరుమాండ్ల రాజు, చిలుముల రాజేందర్, టేకు రవి, మేడిపల్లి రాజు ఎన్నుకోబడ్డారు. ముఖ్య సలహాదారులుగా చింతల రమేష్, అల్లం రవీందర్, ఆకుల రవీందర్, పిట్టల రాజమౌళి, బుర్ర శ్రీధర్, ఆకుల హరీష్, మూసాపూరి సాయిలు, కోడెల రాయమల్లు, కొక్కుల రాములు ఎంపికయ్యారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915